క్లుప్తంగా

7న పాలపిట్ట సైక్లింగ్ రైడ్-2023

గచ్చిబౌలి: హైదరాబాద్ నగరంలో మొదటి ఫారెస్ట్ ట్రయల్ సైకిల్ రైడ్‌ను కొండాపూర్‌లోని పాలపిట్ట సైక్లింగ్ పార్కులో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 7వ తేదీ ఉదయం 6 గంటలకు ఈ సైకిల్ రైడ్ ప్రారంభమవుతుంది. హైదరాబాద్ బైసైక్లింగ్ క్లబ్, టీఎస్‌ఎఫ్‌డీసీ, డబ్ల్యూసీపీఏ సంయుక్త ఆధ్వర్యంలో ఈ రైడ్‌ను నిర్వహిస్తారు. పాల్గొన్న వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేస్తారు. 6వ తేదీ వరకు ఔత్సాహికులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

నేటి 'సంత'

గచ్చిబౌలి: వారాంతపు సంతల నిర్వహణలో భాగంగా గురువారం శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో ఎన్టీఆర్‌కాలనీ, హుడాకాలనీ, ఆల్విన్‌కాలనీ, ఓల్డ్ హఫీజ్‌పేట్, జనప్రియ అపార్ట్‌మెంట్స్‌లోని సాయిబాబా ఆలయం, టెలికామ్‌నగర్ ఉర్దూ యూనివర్శిటీ రోడ్డులో, దూబేనగర్, టీఎన్‌జీఓ కాలనీలో నిర్వహిస్తారు. ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహించే ఈ సంతలో సరసమైన ధరలకు ఆకుకూరలు, కూరగాయలు, దుస్తులు, నిత్యావసరాలు, పండ్లు లభిస్తాయి.

సీఆర్ ఫౌండేషన్‌లో శిక్షణ కేంద్రం

హఫీజ్‌పేట్ : కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ నీలం రాజశేఖర రెడ్డి రీసెర్చ్ సెంటర్‌లో మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం, డైయింగ్, ప్రింటింగ్, బ్యూటీషియన్, ట్యాలీ, డీటీపీ శిక్షణ ఇస్తున్నారు. ముందుగా అడ్మిషన్ కొరకు రూ.150లు చెల్లించాలి. సంవత్సరానికి నాలుగు బ్యాచ్‌లుగా, మూడు నెలల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుంది. ఒక బ్యాచ్‌లో సుమారు 100 మంది మహిళలు ఉంటారు. 15 సంవత్సరాల వయస్సు నుంచి 35 సంవత్సరాల మధ్యలో చిన్నారులు, మహిళలు ఈ శిక్షణలో పాల్గొనవచ్చు. మరిన్ని వివరాలకు కన్వీనర్ వనశ్రీ ఫోన్ : 9246530048లో సంప్రదించగలరు.

ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్
సీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ ఉంది. కుటుంబ సమస్యలు ఉంటే ప్రత్యేకంగా ఫ్యామిలీ కౌన్సిలింగ్ కూడా తీసుకోవచ్చు.

జీరో పాజిటివ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం 12 మందికి కొవిడ్ ర్యాపిడ్ టెస్టులు చేయగా అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు.

ప్లాస్టిక్‌తో భూమి కలుషితం

కేపీహెచ్‌బీకాలనీ: స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంట్ కేపీహెచ్‌బీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ప్లాస్టిక్ రహిత భారత్‌గా మారాలంటూ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి రోషన్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం ద్వారా అనారోగ్యంతో బాటు భూ కాలుష్యం పెరుగుతుందన్నారు. ప్లాస్టిక్ భూమిలో కలిసిపోవాలంటే లక్ష సంవత్సరాల సమయం పడుతుందని తెలిపారు. ప్లాస్టిక్ భూమిలో కలిసి భూతలానికి నీరు వెళ్లడానికి వీలు లేకుండా చేస్తుందన్నారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌డీ కూకట్‌పల్లి విభాగ కన్వీనర్ సన్నిత్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

అభినందన

రాయదుర్గం: పదోన్నతి పొందిన సైబరాబాద్ జాయింట్ కమిషనర్ అవినాష్ మహంతిని సీపీ స్టీఫెన్ రవీంద్ర అభినందించారు. అవినాష్ మహంతి ఐజీగా పదోన్నతి పొందారు. ఈ మేరకు అవినాష్‌మహంతి బుధవారం సైబరాబాద్ కమిషనరేట్‌లో స్టీఫెన్ రవీంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన అభినందన తెలిపి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



ఖాజాగూడ చెరువు పక్కన నిర్మించిన లింకురోడ్డు



చెరువు వద్ద మౌనముద్రలో శిల్పం

ఖాజాగూడ చెరువుకు కొత్తశోభ

- గ్రీనరీ, ఆకట్టుకుంటున్న శిల్పం
- అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని కేటీఆర్ సూచన

రాయదుర్గం: ఖాజాగూడ పెద్ద చెరువు కొత్తశోభను సంతరించుకోనుంది. గచ్చిబౌలి డివిజన్‌లోని ఖాజాగూడ నుంచి గచ్చిబౌలి వైపు వెళ్ళే లింకు రోడ్డులో కుడివైపున, ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ఎదురుగా 39 ఎకరాల్లో విస్తరించి ఉంది. శివారులోని దుర్గం చెరువు, మల్కం చెరువు తరహాలోనే దీన్ని కూడా అందుబాటులోకి తీసుకొస్తే 'వీకెండ్ స్పాట్'గా మారే అవకాశం లేకపోలేదు.

- జీహెచ్‌ఎంసీ ఈ చెరువు అభివృద్ధి పనులను దివ్యశ్రీ ఎన్‌ఎస్‌ఎల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, మిడాస్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలకు కేటాయించారు.
- ఇటీవల మంత్రి కేటీఆర్ సమక్షంలో ఈ సంస్థలు ఒప్పందం చేసుకున్నాయి. రూ.25 లక్షల వ్యయంతో సుందరీకరించనున్నారు.
- ఈ చెరువు వద్ద ప్రస్తుతం లింకురోడ్డు, డివైడర్, గ్రీనరీ, ఫుట్‌పాత్ ఏర్పాటు చేయడంతో వాకర్స్ నిత్యం ఉదయం, సాయంత్రం సందడి చేస్తున్నారు.
- చెరువు వద్ద లింకురోడ్డు పక్కనే మౌనముద్రలో ఉన్న శిల్పం ప్రత్యేక ఆకర్షణగా మారింది.
- ఇక చెరువు అభివృద్ధిలో భాగంగా టాయిలెట్ల నిర్మాణం, కూర్చోవడానికి బల్లల ఏర్పాటు
- గ్రీనరీ, లైటింగ్, ఓపెన్‌జిమ్, యోగా చేసేందుకు ఏర్పాటు. కాగా అవకాశం ఉంటే థీమ్ పార్కు ఏర్పాటు చేయాలని మంత్రి సూచన.
- నగర శివారులో సహజ సిద్ధమైన బండ రాళ్ళతో కూడిన పెద్ద చెరువును మరింత అభివృద్ధి చేయనున్నారు.



ఖాజాగూడ చెరువు

లింగంపల్లిలో మరో బ్రిడ్జి నిర్మించాలి

గచ్చిబౌలి: లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి(ఆర్‌ఓబీ) సమస్యాత్మకంగా మారిందని, మోడ్రన్ టెక్నాలజీతో మరో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌కు విన్నవించారు. సికింద్రాబాద్‌లో రైల్వే జీఎంను కలిసి శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని రైల్వే సమస్యలపై వారు విన్నవించారు. ఆదిత్యనగర్ వద్ద రైల్వే ట్రాక్‌కు సమాంతరంగా బాక్స్‌డ్రెయిన్ నిర్మాణం కోసం నాలా విస్తరణకు అనుమతి ఇవ్వాలన్నారు. మాదాపూర్-హఫీజ్‌పేట్ రైల్వే ట్రాక్ చుట్టుపక్కల డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందన్నారు. శిల్పాగార్డెన్ వద్ద అండర్ పాస్ నుంచి మంజీరా పైపులైన్ రోడ్డులోని వైశాలినగర్ వరకు వరద నీటి కాలువ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరారు. లింగంపల్లి- చందానగర్ రైల్వేస్టేషన్ల మధ్య ఉన్న ఆర్‌యూబీ వద్ద నాలా విస్తరణ, సీసీ రోడ్డు నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరారు.



దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌తో సమావేశమైన ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే గాంధీ

చెత్తను తరలించరా..?

మియాపూర్ : ప్రధాన రోడ్ల పక్కన ఖాళీ ప్రదేశాలలో పేరుకుపోయిన చెత్త దుర్గంధం వెదజల్లుతుంది. చందానగర్ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ నుండి ఆర్టీసీ కాలనీకి వెళ్లే రోడ్డు పక్కన చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. చుట్టుపక్కల ప్రాంతాలవాసులు చెత్త వేయడంతో గుట్టలుగా పేరుకుపోయింది. ఈ చెత్తను ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో రోడ్డుపైకి వస్తుందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు చెత్త తడిసి దుర్వాసన వెదజల్లుతోందని వాపోతున్నారు. కాలనీ, బస్తీలలో చెత్తను తీసుకువెళ్లే ఆటోదారులు ఇంటికి రూ.50ల నుండి 75 వసూలు చేసేవారు. ప్రస్తుతం రూ.120ల వరకు తీసుకుంటుండడంతో ప్రజలు డబ్బులు ఇచ్చుకోలేక చెత్తను రోడ్డుపైనే ఖాళీ ప్రదేశాలలో పడేస్తున్నారని సమాచారం. చెత్త వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



చందానగర్ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ నుండి ఆర్టీసీ కాలనీకి వెళ్లే రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

సైబర్ వలలో చిక్కి...



పటాన్‌చెరు టౌన్: సైబర్ నేరగాళ్లు రోజుకో రీతిన రెచ్చిపోతున్నారు. అనేక రకాలుగా ఆశ చూపి అందినకాడికి దండుకుంటున్నారు. ఒకే రోజు పటాన్‌చెరు, అమీన్‌పూర్ పీఎస్‌ల పరిధిలో మూడు ఘటనలు చోటుచేసుకున్నాయి.

లోన్ ఇప్పిస్తానని...
రూ.16 లక్షల పర్సనల్ లోన్ ఇప్పిస్తామని ఓ వ్యక్తిని మోసగించి అతని వద్ద నుంచి రూ.83,374లు కాజేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామానికి చెందిన రాజును ఏప్రిల్ 15వ తేదీన గూగుల్‌లో పర్సనల్ లోన్ రూ.16 లక్షలు ఇప్పిస్తామని ఒకరు నమ్మబలికారు. అది నమ్మిన బాధితుడు తన వివరాలను నమోదు చేశాడు. లోన్ ప్రాసెస్ కోసం ముందస్తుగా కొంత నగదు చెల్లించాలని తెలిపారు. పలు దఫాలుగా బాధితుని నుంచి మొత్తం రూ.83,374లు కట్టించుకున్నారు. ఈ క్రమంలో అనుమానం వచ్చిన బాధితుడు లోన్ ఎప్పుడు ఇప్పిస్తారని అడగడంతో గుర్తుతెలియని వ్యక్తి స్పందించలేదు. దీంతో తను మోసపోయినట్టు గుర్తించి పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

పార్ట్ టైం ఉద్యోగం ఉందని..
పటాన్‌చెరు పట్టణంలోని జేపీ కాలనీకి చెందిన షరీఫ్‌కు ఏప్రిల్ 25వ తేదీన పార్ట్ టైం ఉద్యోగం ఉందని మెసేజ్ వచ్చింది. బాధితుడు ఆ మెసేజ్‌కి స్పందించి తన వివరాలను నమోదు చేశాడు. ముందుగా రూ.2వేలు చెల్లించి ఆన్‌లైన్‌లో ఇచ్చిన టాస్క్ పూర్తి చేశాడు. దీంతో బాధితుడికి తిరిగి రూ.2,600లు చెల్లించారు. దీనిని నమ్మిన బాధితుడు పలు దఫాలుగా చెల్లిస్తూ ఇచ్చిన టాస్కులు పూర్తిచేశాడు. మొత్తం రూ.107,600లు చెల్లించాడు. తను చెల్లించిన నగదుతో పాటు రెట్టింపు నగదు ఇవ్వాలని బాధితుడు కోరగా గుర్తుతెలియని వ్యక్తి స్పందించలేదు. దీంతో బాధితుడు మోసపోయినట్టు గుర్తించి సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేశాడు.

రెట్టింపు ఆశ చూపి...
రెట్టింపు డబ్బు ఇస్తామని ఆశ చూపిన అపరిచితులు ఇద్దరి నుంచి డబ్బు కాజేసిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...అమీన్‌పూర్‌కు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి ఏప్రిల్ 13వ తేదీన వాట్సాప్ ద్వారా పార్ట్ టైం జాబ్ లింక్ వచ్చింది. దీంతో బాధితుడు వివరాలను నమోదు చేసి నగదు పలు దఫాలుగా, ఇన్వెస్ట్ చేస్తూ టాస్కులు చేస్తూ పోయి చివరకు తాను పెట్టిన రూ.3.67లక్షలపైన రెట్టింపు నగదును ఇవ్వాలని అడగగా అప్పటి నుంచి స్పందన రాలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్టు గుర్తించి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి అనంతరం అమీన్పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

- అమీన్‌పూర్‌కు చెందిన మరో బాధితుడికి ఏప్రిల్ 23వ తేదీన పార్ట్ టైం ఉద్యోగం పేరిట మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు వివరాలను నమోదు చేసి నగదు ఇన్వెస్ట్ చేస్తూ ఇచ్చిన టాస్క్ పూర్తిచేశాడు. తన పెట్టిన రూ.1.81లక్షలకు రెట్టింపు నగదు ఇవ్వాలని అడగ్గా స్పందన లేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్టు గుర్తించి సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేసి అనంతరం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

మహిళలకు ఉచిత శిక్షణ

మూసాపేట: కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని సోని కాంప్లెక్స్‌లో సంజీవరెడ్డి ఫౌండేషన్‌లో మహిళలకు ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు డా. ఎస్. చంద్రశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో జ్యూట్ బ్యాగుల తయారీ, బ్లౌజ్ డిజైన్, మగ్గం వర్కు, బ్యూటీషియన్, టైలరింగ్, ఎంఎస్ ఆఫీస్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 16- 45 సంవత్సరాల వయస్సు గల వారు అర్హులన్నారు. ఈ నెల 5నుంచి తరగతులు ప్రారంభమవుతాయని శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్ ఇస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9396161936 నంబర్‌లో సంప్రదించగలరు.

కాలనీ కాంటాక్ట్



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని రాంనరేష్ నగర్‌లో జరిగిన కాలనీ కాంటాక్ట్ కార్యక్రమంలో అధికారులతో, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు బుధవారం పాదయాత్ర ద్వారా సమస్యలు తెలుసుకున్నారు. ప్రజలు కాలనీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు ఏఈ హరిసింగ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కమ్యూనిటీ ఆర్గనైజర్ ముస్తఫా, హార్టికల్చర్ దాసు, డ్రైనేజీ సూపర్‌వైజర్ నరేందర్, వీధి లైట్ల సూపర్‌వైజర్ కుమార్, లైన్‌మెన్ కాశీ, ఎస్‌ఎఫ్‌ఏ శ్రీకాంత్, కాలనీవాసులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి



ఫెలోషిప్ అవార్డులను అందజేస్తున్న డా.చంద్రశేఖరయ్య

మియాపూర్ : జాతీయ విద్యా విలువలను పెంపొందించే దిశగా పీపుల్స్ గవర్నెన్స్ ఫోరం కృషి చేస్తుందని సైబర్ పోలీసింగ్ ఆర్‌అండ్ డీ ఇంటలిజెన్స్ బ్యూరో (పీపుల్స్ గవర్నెన్స్ ఫోరం) అధ్యక్షులు డాక్టర్ కణగలూరి చంద్రశేఖరయ్య అన్నారు. బుధవారం మియాపూర్‌లోని ప్రగతి ఎన్‌క్లేవ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఉన్నతస్థాయి విద్యాలయాల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. నేటి ఉన్నత విద్యా వ్యవస్థలో దేశ విలువలు మరింతగా పెంపొందించేందుకు సైబర్ పోలీసింగ్ పరిశోధన కృషిలో నూతన ఒరవడులతో విజ్ఞాన సమాజాన్ని నిర్మించే దిశలో ఈ ఫోరం ముందడుగు వేస్తుందన్నారు. విద్యార్థులైనా, నెటిజన్‌లలో జాతీయ శీలం బాగుంటే భారత జాతిని భ్రష్టు పట్టించే సైబర్ నేరాలను నిర్మూలించే సత్తా వారిలో మెండుగా ఉంటుందన్నారు. సీఏఐఆర్‌ఎస్ ఫౌండేషన్, విద్య, వైజ్ఞానిక, సాంకేతిక సంస్థలతో అనుసంధానంగా విశిష్ట ఇంజనీర్, పరిశోధకులకు ఫెలోషిప్ అవార్డులను అందజేశారు.

ప్రజల కష్టాలు పట్టించుకోవటం లేదు

'గడప గడపకూ బీజేపీ'లో రవికుమార్‌యాదవ్

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి ప్రాంతంలోని కాలనీలు, బస్తీలలో మౌలిక వసతులు కరువయ్యాయని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ పేర్కొన్నారు. బుధవారం గడపగడపకూ బీజేపీ 27వ రోజు పాదయాత్రలో భాగంగా కొండాపూర్ డివిజన్ బంజారా బస్తీ, వడ్డెరబస్తీలలో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీకి బుద్ధిచెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజలు ఎన్నో సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆంజనేయులు, మన్యంకొండ ,సురేష్,రవినాయక్, దన్‌రాజ్ నాయక్, సాగర్ నాయక్, శ్రీకాంత్, కిషన్, సాయి పాల్గొన్నారు.

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్‌లో జరుగుతున్న గడప గడపకు బీజేపీ కార్యక్రమంలో పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, సీనియర్ నాయకులు మాధవరం కాంతారావు, అద్వానీ సూర్యారావు, వడ్డేపల్లి రాజేశ్వరరావులతో కలిసి నాయకుడు రవికుమార్ యాదవ్ బుధవారం 27వ రోజు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలు తప్ప ప్రజల కష్టాలను పట్టించుకోవడం లేదన్నారు. ప్రజల కష్టాలు తెలుసుకునేందుకు ఇంటింటికీ తిరుగుతున్నానని ఒకసారి అవకాశం కల్పిస్తే తప్పకుండా శేరిలింగంపల్లి ముఖ చిత్రాన్ని మారుస్తానని హామీ ఇచ్చారు.



కరపత్రం అందజేస్తున్న రవికుమార్‌యాదవ్

హోటల్‌లో వ్యభిచారం.. ఇద్దరి అరెస్ట్

రెండు స్మార్ట్ ఫోన్లు, నగదు, డైరీ స్వాధీనం

గచ్చిబౌలి: వ్యభిచారం నిర్వహిస్తున్న హోటల్‌పై దాడి చేసిన ఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అంజయ్యనగర్‌లోని రాయల్ పామ్ హోటల్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు యాంటీ హ్యూమన్ ట్రాకింగ్ యూనిట్ మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ బృందానికి సమాచారం అందింది. దీంతో ఈ బృందం హోటల్‌లోని 208, 406లపై దాడులు చేశారు. పంజాబ్, పశ్చిమబెంగాల్ యువతులతో జార్కండుకు చెందిన ఆర్గనైజర్ విజయకుమార్, సబ్ ఆర్గనైజర్ అలీవర్ డాంగ్‌లు వ్యభిచారం నిర్వహిస్తున్నారు. ప్రధాన నిందితుడు విజయకుమార్ పరారవగా డాంగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని రాయదుర్గం పోలీసులకు అప్పగించారు. ఘటనా స్థలంలో రెండు స్మార్ట్ ఫోన్లు, ఆరు కండోమ్‌లు, రూ.670 నగదు, ఒక డైరీ, రెండు గదుల తాళం చెవులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

గచ్చిబౌలి: సైబర్ నేరాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని పోలీసులు సూచించారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గౌలిదొడ్డిలోని మనీష్‌రెడ్డి పీజీలో సైబర్ క్రైమ్స్‌పై అవగాహనా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరిగాయని, వీటిని అరికట్టడానికి అందరూ సహకరించాలన్నారు. ముఖ్యంగా నెట్‌వర్క్‌ల పట్ల, వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో అన్నింటిని చూడాలనే ఆసక్తి, తెలియని వారితో పరిచయం పెంచుకోవడం వంటి వాటికి పూర్తిగా దూరంగా ఉండాలన్నారు. తమకు సంబంధించిన ఎలాంటి సమాచారం ఇతరులకు ఇవ్వరాదని సూచించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, 40మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

మేయర్‌కు కార్పొరేటర్ వినతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం కార్పొరేటర్ పుష్పనగేష్ నగర మేయర్ గద్వాల విజయలక్ష్మిను కలసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. డివిజన్ పరిధిలోని అశోక్‌నగర్, జ్యోతినగర్ కాలనీల మధ్యలో ఉన్న ఓపెన్ డ్రైన్ తొలగించి నూతన బాక్స్ డ్రైన్‌ను నిర్మించాలని కోరినట్లు తెలిపారు. రామచంద్రాపురంలోని పాషాకాలనీ వద్ద ఉన్న నాలా చుట్టూ బాక్స్‌డ్రైన్‌కు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేయగా, అందుకు ఆమె సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.

కార్మిక సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తాం

పటాన్‌చెరు టౌన్: కార్మిక సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తామని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి అన్నారు. ఐఎన్‌టీయూసీ వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు, బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా సంఘటిత, అసంఘటిత రంగాల్లో పని చేస్తున్న కార్మికులందరికీ కనీస వేతనం రూ.26వేలు అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, నాగరాజుగౌడ్, సామ్రాట్, భోజరాజు, గోవర్ధన్, రాజుచారి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పటాన్‌చెరు ట్రాఫిక్ ఎస్‌ఐ ఆంజనేయులు అన్నారు. బుధవారం పటాన్‌చెరు బస్టాండ్ సమీపంలో వాహన దారులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి రోజూ వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. వాహనదారులు సెల్‌ఫోన్ మాట్లాడుతూ, రాంగ్‌రూట్‌లో వాహనాలు నడపొద్దని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే సీజ్ చేసి కోర్టుకు పంపిస్తామన్నారు.

అంతర్గత రోడ్లు.. అడుగేసేదెలా..?

అభివృద్ధి పనుల్లో అలసత్వం .. ప్రజల అవస్థలు

హఫీజ్‌పేట్ : డివిజన్ పరిధిలోని మైత్రీనగర్‌లో అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. మైత్రీనగర్ ఫేజ్ 3లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ వేసిన అనంతరం రోడ్డు వేయకపోవడంతో రాకపోకలకు స్థానికులు ఇబ్బందిపడుతున్నారు. నిత్యం మురుగునీటి సమస్యతో రోడ్డుపై అడుగుపెట్టలేకపోతున్నామని వాపోతున్నారు. వర్షం పడితే బయటకు రాలేమని రోడ్డు చిత్తడిగా మారుతోందన్నారు. అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.



మైత్రీనగర్ ఫేజ్ 3లోని పార్కు ముందు అసంపూర్తిగా రోడ్డు పనులు



పార్కు ముందు పొంగుతున్న మ్యాన్‌హోల్



చిత్తడిగా మారిన రోడ్డు